# నవజగత్తు నిర్మిద్దాం!

'హసన్'

రేయి వేయిరెక్కలువిప్పి లోకం నడినెత్తిమీద నెమ్మదిగా నడుస్తోంది. నింగినొసటిమీద నిప్పు నెరుసుల్లా నిలుచున్న చుక్కలు ఎవరికోసమో కనుసైగలు చేస్తున్నాయి. కాలం కదలని ఎండుమోడులా నింగివంక నోరెత్తి చూస్తోంది. నడిసంద్రపు నిశ్శబ్దంలో... అరుణోదయం ఎప్పుడో!

అంతలో ఎంతోమార్పు

భూమ్యాకాశాలమధ్య భయంకర శబ్దం ........ కదలిగుండెలపై కొండలెన్నో ఫెళఫెళా విరిగి పడిపోతున్నాయి....దిక్కులు దద్దరిల్లి చెవులు మూసుకున్నాయి .... పరుగెత్తేపయోధరాల ప్రళయగర్జన....

ఆకాశం అదిరిపోతోంది ... మబ్బు ముసుగుల్లో సంకులసమరం జరుగుతోంది రెక్కతెగిన పిట్టల్లా....రాలిపోతున్నాయి ........ ఎన్నో, ఎన్నెన్నో చుక్కలు...

కటికిరాత్రి కలతనిదురలో లోకం కెవ్వున అరిచింది,

మగతనుండి మేల్కొన్న మానవుడే కాళ్ళువిరిగి వెనక్కి విరుచుకు పడిపోయాడు. కాలం కాలే కొరవిలా నోట నిప్పులు గ్రక్కుతూ అతనిచుట్టూ తిరుగుతోంది.

బ్రతుకు బాటవార నిప్పుల పర్వతం ప్రళయనాట్యం చేస్తోంది.

రక్తం.... నరరక్తం .... నవజగత్తు నిర్మించే నరరక్తం . నిప్పుల నగాధరంపై ఇంధనమై దగ్ధమైపోతోంది.

ఎందరో వికలాంగులు ఎలుగెత్తి ఏడుస్తూ కడుపులు బాదుకుంటూ పడుతూ, లేస్తూ, తూలిపోతూ అగాధంలో కుప్పలై కూలిపోతున్నారు. యుద్ధం.... అంతర్యుద్ధం ... అన్నదమ్ముల అంతర్యుద్ధం.........అణువణువూ గొంతెత్తి గర్జించాయి.

బిగుసుకున్న సంకెళ్ళ గలగలలో నా కన్నతల్లి కన్నీటి శోకాలు మెల్లిమెల్లిగా వినిపిస్తున్నాయి. కటకటాల సందుల్లో నా తల్లి కుమిలి కుమిలి ఏడ్చి సంకెళ్ళ నడుమ మూర్ఛిల్లి పడింది.

నాబానిసదేశం ఈనాడొక స్మశానవాటిక. రక్తసంబంధం తెగిపోయింది. అన్నకి తమ్ముడే చితిపేరుస్తున్నాడు. కాలిపోయేకొంపల్లో అమాయకప్రాణాలు ఫటఫటా ప్రేలిపోతున్నాయి కుత్తుక తెగినకళేబరం 'శాంతి' 'శాంతి' అంటూ అరుస్తూ గిజగిజా తన్నుకుంటోంది,

కాలేకాటి వెల్గులో తెల్లటివికృతాకారం ఎగిరెగిరి పడుతోంది....వెక్కిరిస్తూ వికటాట్టహాసం చేస్తోంది... దేశాన్ని రెచ్చగొడుతోంది....చిచ్చులోకి లాక్కుపోతోంది ....

ముందుకుపోతే కత్తులవర్షం,వెనక్కిపోతే నిప్పుల సుడిగుండం, దిక్కులేని

నా దేశం గిలగిలా తన్నుకుంటోంది. దిక్కులేని నా ప్రజ హాహా కారంచేస్తోంది.

ఉరికంబాలచాటున మాటున్న శత్రువు కత్తికి పదునెక్కిస్తున్నాడు. సంకెళ్ళు బిగదీస్తున్నాడు.... మతపిశాచాల మచ్చిక చేస్తున్నాడు.

కత్తిమెరుపుల్లో కదంత్రొక్కే మతోన్మదిత మానవత్వం భగ్గునమండి బూడిదై పోతోంది.... వెనుకటివీరోచిత చరిత్ర ముక్కలై చెక్కలై చెదిరి పోతోంది. తెగిన శిరస్సుల గుట్టలో భవిష్యత్తు ఊపిరాడక మూల్గుతోంది.

మానవుడా ! అలాచూడు ! నీసోదరి ....నట్టింట్లో....భర్తయెదుట భగ్నశీల ....వలవలా ఏడుస్తోంది....తెగినపుస్తెల పేరు దుమ్ములో కలిసిపోయింది.

మనకిది శుభంకాదు

మనకిది మేలుకాదు

ఇదిమన స్వతంత్రసమరంలోవిషాద ఘట్టం.

శవాల గుట్టమీద శత్రువు శిబిరంలో పండుగదినం జరుగుతోంది. శాశ్వతపరిపాలనకై సమారాధన జరుగుతోంది. మానవుడా ! చరిత్ర తెరలొత్తిగించి చూడు. ఎర్రటి రక్తాక్షరాల్లో....మెరుస్తోంది....'ఖిలాఫత్' హిందూ ముస్లిం రక్తం నిప్పుల బాణంలా పగవాడి గుండెల్లో దూసుకుపోయిందారోజున

నాకన్న తల్లి కన్నుల అనందాశ్రువులు రాల్చిందా రోజున....

పగవాడి కోటగోడ గజగజా వణికిందా రోజున....

మానవుడా, మన దొక మహోజ్వల వీరోచిత చరిత్ర. కళంకితం చెయ్యకోకు ! అహో, అదో ! అదిగదో ! చీకట్లను చీల్చుకుంటూ రివ్వు రివ్వున రెక్కలాడిస్తూ వస్తున్నది మెరుపుతీగ ....ఆకలి అంచులపై తిరిగే మరచక్రం వస్తున్నది.... ఎడారిలో ఒయాసిస్‌లా వస్తున్నది....ఉరికి ఉరికి వస్తున్నది ....కార్మిక హృదయం, పడగెత్తి బుసగొట్టుతోంది....కలహపిశాచాల పీకలు నొక్కేస్తున్నది.... బానిసలకు బేధం లేదంటూ....ప్రతీకార ప్రళయాట్టహాసం చేస్తూ....శత్రువు శిబిరంమీదికి దూకిదూకి పోతున్నది. అదో, అలాచూడు, కదభూమి కేకేస్తున్నది. ఎత్తిన సుత్తి కొడవళ్లై పీడితలోకం ముందుకుపోతున్నది. నల్లగొండ నడిగడ్డమీదే నైజాం సామ్రాజ్యానికి సమాధి గట్టేస్తున్నది అదే – అదే, నవసమాజ హర్మ్యానికి మొదటి మెట్టు.

నిరంకుశుల శిరస్సులే తెగనరికేస్తూ నింగిమీద నవపతాక నిలుచున్నాదదిగో మానవుడా ! గతచరిత్ర మరిచిపోకు ! మగతనుండి మేల్కోవోయ్ ! కార్మిక లోకం అభయ హస్తంచాచింది....నీవెనుకే నడుస్తోంది....మనమంతా బానిసలం....మతంలేని మానవులం... మన రక్తం....నవజగత్తు నిర్మించే మనరక్తం ....నిరర్థకం కాకూడదు. లోకానికి అనర్థకం రాకూడదు.

కన్నతల్లి కంఠశోష వింటున్నవా ! ముందొస్తున్నది జీవన్మరణసంగ్రామం పగవాడి నెత్తుటి రాచరికంలో చరమాంకం జరుగుతోంది. మన పొట్టకూటి పోరాటంలో ప్రథమాంకం జరుగుతోంది. (మిగతా 20 వ పేజీలో)